క్లుప్తంగా

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థినిలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

రేగిడి : మండలంలోని దేవుదళ కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినిలకు బాలికల చట్టాలపై ఎస్‌ఐ నీలావతి అవగాహన కల్పించారు. బుధవారం పాఠశాలలో బాలికలు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. మాదకద్రవ్యాలు, సైబర్ క్రైంపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఒత్తిడికి గురికాకుండా, ఇష్టపడి చదవాలని, మంచి ఉద్యోగాలు సంపాదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలతో ఎంఈఓల సమావేశం



హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

రేగిడి : మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య బుధవారం సమావేశం అయ్యారు. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆదేశాలతో వెబ్‌ఎక్స్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, సమస్యలు, విద్యార్థుల సామర్థ్యాలు, బోధన పద్ధతులు, గ్రేటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించి వాటిని యాప్‌లో నమోదు చేసే విధానాన్ని వివరించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ టి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల వితరణ



విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

బొబ్బిలి రూరల్: మండలంలోని కలవరాయి గ్రామంలోని ఉన్న బీసీ కాలేజ్ హాస్టల్ విద్యార్థులకు గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు హరికృష్ణ, సింహాచలం 50 దుప్పట్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రానున్న చలికాలంలో ఈ దుప్పట్లు ఎంతగానో ఉపకరిస్తాయని అన్నారు. మరిన్ని కావాలంటే తమను సంప్రదించాలని, విద్యార్థులు శ్రద్ధతో తమ చదువులను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ శ్రీనివాసరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

తల్లికి వందనం ఎప్పుడిస్తారో చెప్పాలి



మాట్లాడుతున్న సాయికిరణ్ తదితరులు

బొబ్బిలి: కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం నిధులను ఎప్పుడు ఇస్తామన్న సమాచారాన్ని తల్లిదండ్రులకు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తెలియజెప్పాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ అన్నారు. బుధవారం యాదవ వీధి కూడలిలో విలేకర్లతో మాట్లాడుతూ విద్యా సంవత్సరం చివరికి వస్తున్నా తల్లుల ఖాతాలకు ఎప్పుడు జమ చేస్తారని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 2022 – 23 సంవత్సరానికి సంబంధించిన బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్, పండు, తేజ ఉన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: మండలంలోని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పవన్‌కుమార్ బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన పార్వతి జామి మండలానికి బదిలీపై వెళ్లడంతో పవన్‌కుమార్ పార్వతీపురం మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు తీసుకున్న వెంటనే బుధవారం ఎంపీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో మంచి నీటి ట్యాంకులను శుద్ధి చేయించాలన్నారు. చేతి బోరుల వద్ద పరిశుభ్రంగా ఉంచడంతో పాటు క్లోరినేషన్ చేయించాలన్నారు. తాగునీటి కుళాయిల ద్వారా ప్రజలకు శుద్ధజలం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

పట్టించుకునేవారు లేరని...

- రోడ్డును అడ్డంగా తవ్వేసి పైపులైన్ మరమ్మతులు
- గంటల తరబడి ట్రాఫిక్ ఇక్కట్లు
- ట్రాఫిక్‌లో చిక్కుకున్న జేసీ మాధవన్, ఆర్డీఓ సత్యవాణి
- ట్రాఫిక్ క్లియర్ చేసిన తహసీల్దార్ ఎస్‌కే రాజు





రోడ్డుకు ఓ వైపు ట్రాఫిక్‌లో వాహనాలు (ఇన్‌సెట్లో) ప్రధాన రహదారిపై పొక్లెయిన్ అడ్డంగా పెట్టి తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

రాజాం : గత ప్రభుత్వంలో జవాబుదారీతనం ఉండేది. అధికారులు ఏమి చేయాలనుకున్న ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేవారు. ప్రజలకు ఇబ్బంది కలిగించిన పనులు చేస్తే అధికార పార్టీ నేతలకైనా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమశిక్షణా చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడంలేదు. ఏమి చేసినా పట్టించుకునేవారు...అడిగేవారు లేరనే పరిస్థితి ఏర్పడింది. దీంతో అటు అధికార పార్టీ నేతలు, ఇటు అధికారులు సైతం ఎటువంటి ముందస్తు సమాచారాలు లేకుండా, నిబంధనలు అతిక్రమించి పనులు చేస్తున్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇందుకు నిదర్శనమే ఈ ఫొటోలు. రాజాం మున్సిపాల్టీ పరిధిలో తిమ్మయ్యపేట సమీపంలో రాజాం – చీపురుపల్లి ప్రధాన రహదారిని వాటర్ పైప్‌లైన్ నిమిత్తం మున్సిపల్ కార్యాలయ సిబ్బంది హెవీ ట్రాఫిక్ ఉన్న సమయంలో పొక్లెయిన్ రోడ్డుకు అడ్డంగా పెట్టి తవ్వారు. గంటల సమయం కేటాయించి పైపులు అమర్చారు. ఈ సమయంలో రాజాం నుంచి చీపురుపల్లి వైపు, చీపురుపల్లి నుంచి రాజాం వైపు వచ్చే వందలాది వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుని, గంటల సమయంల ఎండలో నిరీక్షించాల్సిన పరిస్థితి వచ్చింది. కనీసం ఒక పోలీస్ కానిస్టేబుల్ కూడా అక్కడ లేకపోవడం అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇదే సమయంలో చీపురుపల్లి వైపు నుంచి రాజాం వస్తున్న జిల్లా జేసీ ఎస్ సేతుమాధవన్, ఆర్డీఓ జీవీ సత్యవాణిల వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. వీరికి ట్రాఫిక్ క్లియర్ చేయడానికి అక్కడ పోలీసులు లేకపోవడం, మున్సిపల్ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో వాహనంలో ప్రయాణిస్తున్న రాజాం తహసీల్దార్ ఎస్‌కే రాజు వాహనం దిగి ట్రాఫిక్ క్లియర్ చేశారు. స్వయాన జేసీకే ఈ ట్రాఫిక్ కష్టాలు ఎదురవ్వడం గమనార్హం. మరోవైపు అస్తవ్యస్తంగా రోడ్డున తవ్వి ట్రాఫిక్ ఇబ్బందులు తెచ్చిన మున్సిపల్ అధికారులను పలువురు ప్రయాణికులు నిలదీసారు. ఇదేమి పనులంటూ మండిపడ్డారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా, తాగునీటి పైపులైన్ మరమ్మతులు నిమిత్తం రోడ్డును తవ్వాల్సి వచ్చిందని వెల్లడించారు. ట్రాఫిక్ సమస్య వస్తుందని ఊహించలేదని అన్నారు.



ట్రాఫిక్‌లో చిక్కుకున్న జేసీ వాహనం



ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న తహసీల్దార్ ఎస్‌కే రాజు

ఇసుక రీచ్‌ను తనిఖీ చేసిన జేసీ



కుసుమూరు ఇసుక రీచ్‌ను తనిఖీ చేసి అధికారులకు సూచనలిస్తున్న జేసీ సేతుమాధవన్

తెర్లాం: మండలంలోని కుసుమూరు ఇసుక రీచ్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇసుక రీచ్‌కు సంబంధించిన వివరాలను బొబ్బిలి ఆర్డీఓ రామమోహనరావు, తెర్లాం తహసీల్దార్ హేమంత్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుకరీచ్ నుంచి ఇసుక కావల్సిన వారికి ఉచితంగా పంపిణీ చేయాలని, ఇసుక కావాల్సిన వారు తప్పనిసరిగా స్థానికంగా ఉన్న గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోనేలా అవగాహన కల్పించాలన్నారు. ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇసుకరీచ్ నుంచి ఎవరు ఇసుక తీసుకుంటున్నారో ఆ వివరాలను తప్పనిసరిగా రికార్డులో నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు, గృహ నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చూడాలని జేసీ ఆదేశించారు. ఆయన వెంట బొబ్బిలి ఆర్డీఓ రామ్మోహనరావు, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఆర్‌ఐ కృష్ణమూర్తి, వీఆర్‌ఓ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉన్నారు.

తమరాంలో..

సంతకవిటి: మండలంలోని తమరాం వద్ద ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను జేసీ ఎస్.సేతుమాధవన్ బుధవారం పరిశీలించారు. రీచ్‌కు సంబంధించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ఇసుక ఇంటి యజమానులకు చేరుతుందో లేదో వీఆర్‌ఓల ద్వారా వాకబు చేయాలని తహసీల్దార్ బి.సత్యంకు సూచించారు. చీపురుపల్లి ఆర్డీఓ జి.వి.సత్యవాణి, ఎంపీడీఓ కె.సురేష్ కుమార్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రూ.7.19కోట్లతో చేపట్టనున్న పనుల స్థల పరిశీలన



రంగప్పవలసలో ఉపాధి నిధులతో చేపట్టనున్న పనులకు సంబంధించి స్థల పరిశీలన చేస్తున్న పీఆర్ ఎస్‌ఈ శ్రీనివాస్

తెర్లాం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి మంజూరైన రూ.7.19కోట్లతో చేపట్టనున్న పనులకు సంబంధించి స్థల పరిశీలన చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్‌ఈ) ఎం.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కూనాయవలస, రంగప్పవలస, పణుకువలస, లోచర్ల, ఆమిటి, గంగన్నపాడు, నందిగాం తదితర గ్రామాల్లో బుధవారం పనులు చేపట్టనున్న స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని పంచాయతీల్లో సిమెంటు రోడ్లు, కాలువలు, తదితర పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసిందన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో అన్ని గ్రామాల్లో పనులను ప్రారంభించేందుకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించామని, త్వరలో పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండలంలో 120 పనులకు సంబంధించి రూ.7.19కోట్లు నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో అవసరమైన పనులు చేయనున్నామని చెప్పారు. ఆయనతో పాటు బొబ్బిలి పీఆర్ డీఈ అప్పారావు, తెర్లాం, బొబ్బిలి మండలాల పీఆర్ ఏఈలు సత్యంనాయుడు, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలి



డెంటల్ క్లినిక్ ప్రారంభోత్సవంలో మాజీ ఎంపీ బెల్లాన, డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం : ప్రజలకు వైద్యులు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు సూచించారు. బుధవారం రాజాం పట్టణంలో పాలకొండ రోడ్డులో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ నరేంద్రకుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన సుగుణ మల్టీ స్పెషాల్టీ డెంటల్ క్లినిక్‌ను ప్రారంభించారు. అభివృద్ధి చెందుతున్న రాజాంలో నాణ్యమైన వైద్య, విద్య సేవలు అవసరమని, మేధావులు, వ్యాపారులు, విద్యావేత్తలు, వైద్యులు ఆ దిశగా ఆలోచనలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, గురుగుబెల్లి స్వామినాయుడులు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, టంకాల అచ్చెన్నాయుడులు, వాకముల్ల చిన్నంనాయుడు, కోనారి అప్పారావు, కొర్ను ఈశ్వరరావు, పాగిరి లెనిన్, డాక్టర్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ



బొబ్బిలి రూరల్: వాటర్ ట్యాంకులో క్లోరినేషన్‌పై సూచనలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ మధుసూదనరావు

బాడంగి: మండలంలో ఎక్కడా డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ చెప్పారు. మండలంలోని భీమవరం, మల్లంపేట తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి పరీక్షల నిర్వహణ తీరుపై ఆయన బుధవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలని, కుళాయిల లీకులు అరికట్టాలని, రక్షిత ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్, ట్యాంకుల వద్ద పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని, మురుగు ఎక్కడా నిల్వ లేకుండా చూడాలని సూచించారు.

తెర్లాంలో...

తెర్లాం: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత గ్రామ స్థాయి అధికారులపై చర్యలు తీసుకొనేందుకు వెనుకాడేది లేదని ఎంపీడీఓ రేగి రాంబాబు, సచివాలయ ప్రత్యేకాధికారులు హెచ్చరించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో సచివాలయ ప్రత్యేకాధికారులు పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయాలని సచివాలయ ప్రత్యేకాధికారులు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

ప్రత్యేక పర్యవేక్షణ

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల పట్ల పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్, డీఎస్‌ఓ కె.మధుసూదనరావు సూచించారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామంలోని వాటర్‌ట్యాంకును పరిశీలించి క్లోరినేషన్ జరిగే ప్రక్రియపై పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఎంపీడీఓ పి.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రవణ్‌కుమార్, ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వంగరలో...

వంగర: వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ దిరిశాల ధర్మరాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రం వంగరలో పర్యటించారు. వీధులు పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి వనరులు క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎం బి.విశాలాక్షి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాజాంలో..

రాజాం : మండలంలో ప్రతీ పంచాయతీలో పక్కాగా శానిటేషన్ పనులు నిర్వహించాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి ఎస్.నిర్మలకుమారి అన్నారు. బుధవారం మండలంలో గార్రాజుచీపురుపల్లి, ముద్దాడజోగివలస గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాలు పరిశీలించారు. వాటర్ ట్యాంకులు పరిశీలించి, క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్‌కే రాజు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో మెరుగైన సేవలు



ప్రజారోగ్య శాఖ ఈఈ జ్యోతి, డీఈఈ ఈశ్వరరావు, మున్సిపల్ డీఈ కిరణ్‌కుమార్‌లతో కమిషనర్ రామలక్ష్మి చర్చలు

బొబ్బిలి: ప్రజారోగ్య శాఖ ద్వారా పట్టణాల ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తామని ప్రజారోగ్య శాఖ ఈఈ టి.జ్యోతి అన్నారు. టిడ్కో నుంచి ఇటీవలే ప్రజారోగ్య శాఖకు బదిలీ అయిన ఆమె బుధవారం మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం ఆమె కమిషనర్‌ను కలసి బొబ్బిలి మున్సిపాలిటీకి సంబంధించి తాగునీరు, పారిశుద్ధ్యం, పట్టణ వైద్య సేవలపై ఆరా తీశారు. ఆమెతో పాటు విజయనగరం ప్రజారోగ్య శాఖ డీఈఈ బి.ఈశ్వరరావు తదితరులున్నారు.

మున్సిపల్ డీఈఈగా కిరణ్‌కుమార్

బొబ్బిలి మున్సిపల్ డీఈఈగా పి.కిరణ్‌కుమార్ బుధవారం విధుల్లో చేరారు. ఈయన పార్వతీపురం మున్సిపాలిటీ నుంచి బదిలీపై వచ్చారు. ఈయనతో పాటు మున్సిపల్ ఏఈలుగా ఏఎస్ కోటేశ్వరరావు, గుప్తాలు ఇటీవలే విధుల్లో చేరారు.

టీపీఓగా రేవతి

పట్టణ ప్రణాళికా విభాగం అధికారిగా రేవతి నియమితులయ్యారు. ఈమెతో పాటు టీపీఎస్‌గా ఫిలిప్ బాధ్యతలు స్వీకరించారు. ఇతను విజయనగరం నుంచి బదిలీపై రాగా, టీపీఓ జీవీఎంసీ నుంచి బదిలీపై వచ్చారు.

ఫిజియోథెరపీతో దివ్యాంగులకు ఆరోగ్యం

రేగిడి : దివ్యాంగ చిన్నారులకు ప్రతీ రోజు ఫిజియోథెరపి చేస్తే ఆరోగ్యం బాగుంటుందని వైద్యాధికారిణి కుమారి రమాచంద్రిక అన్నారు. మండలంలోని మండల రిసోర్సు కార్యాలయం వద్ద చిన్నారులకు ఫిజియోథెరపి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. చిన్నారుల అవయవాలు సక్రమంగా పని చేసేందుకు అనుసరించాల్సిన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, ఐఈఆర్‌టీలు యు.మహేశ్వరి, టి.రాజేష్, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్యాంపురంలో రెవెన్యూ సదస్సు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

రాజాం : మండలంలోని శ్యాంపురం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూముల వివరాలు తప్పుగా ఉన్న రైతులు నుంచి తహసీల్దార్ ఎస్‌కే రాజు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్వే డీటీ అనంత్‌కుమార్, ఆర్‌ఐ విద్యాసాగర్, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబాలకు ఆదర్శం అమ్మడమ్మ

- మాజీ ఉప సభాపతి కోలగట్ల



అమ్మడమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉప సభాపతి కోలగట్ల

బొబ్బిలి: ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కొనసాగించిన శంబంగి అమ్మడమ్మ నేటి తరానికి ఆదర్శమని శాసనసభ మాజీ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బుధవారం మండలంలోని పక్కి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు స్వగృహంలో అమ్మడమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మడమ్మ గూర్చి తెలుసుకుని ఉమ్మడి కుటుంబాలకు ఆమె ఇచ్చిన ప్రాధాన్యతను కొనియాడారు. ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే నరేష్ అగర్వాల్, రాజాం మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య పక్కి గ్రామంలోని శంబంగి స్వగృహంలో అమ్మడమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగితో పాటు, ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, ఇరిగేషన్ శాఖ నార్త్ కోస్ట్ సీఈ శంబంగి సుగుణాకరరావు తదితరులున్నారు.

మెలకువలతోనే అధిక దిగుబడులు



బొబ్బిలి రూరల్: వర్షాల నుంచి పంటలను కాపాడుకోవడంపై అవగాహన కల్పిస్తున్న ఏడీ శ్యాంసుందర్

బొబ్బిలి రూరల్ : రైతులు పంటలను పండించే దశలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యాంసుందర్ అన్నారు. మండలలోని రంగరాయపురం, ఎం.బూర్జివలస గ్రామాల్లో రైతులతో పొలం పిలుస్తోంది.. కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల దిగుబడి కోసం అధికంగా రసాయనాలను పిచికారీ చేయడం, చీడపీడల నివారణకు విచక్షణా రహితంగా మందులు వినియోగించడం మంచిది కాదన్నారు. తుఫాన్ నేపథ్యంలో పంటలను రక్షించే విధానంపై అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శి ఎంపీ కృష్ణవేణి, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

పంటలను నిశితంగా పరీక్షించుకోవాలి

రేగిడి : వరి పంట మరి కొద్దిరోజుల్లో కోత దశకు చేరుకుంటుందని, ఇటువంటి సమయంలో పంటను నిశితంగా పరీక్షించి, కాపాడుకోవాలని ఏఓ మురళీకృష్ణ అన్నారు. అక్కన్నఅగ్రహారం, అంబఖండి గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రబీకి సంబంధించి అపరాల విత్తనాలు రాయితీపై ఇస్తామని, రైతులు వాటిని పొందాలని కోరారు.

అన్ని ప్రాంతాల్లో క్లోరినేషన్ తప్పనిసరి : జేసీ



బొబ్బిలి: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ, ఆర్డీఓ తదితరులు

బొబ్బిలి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేశారా.. లేదానన్న విషయాలను మండల, వార్డు స్థాయి నుంచి తెలుసుకునేందుకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయం నుంచి జేసీ సేతుమాధవన్ కూడా పాల్గొని అధికారులతో మాట్లాడారు. పలు మండలాలు, మున్సిపాలిటీ అధికారులతో జేసీ మాధవన్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో క్లోరినేషన్ పూర్తయిందా అని అడిగి తెలుసుకున్నారు. దానా తుఫాన్ నేపథ్యంలో తీసుకున్న ముందస్తు జాగ్రత్తల గూర్చి మాట్లాడారు. ఆర్డీఓ తదితరులు పాల్గొన్నారు.

రక్షితమంచినీటి పథకం పరిశీలించిన జేసీ

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామంలో రక్షిత నీటి పథకాన్ని జేసీ సేతుమాధవన్ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

గణిత దీప్తిని పుస్తకాల ఆవిష్కరణ

రాజాం : ప్రభుత్వ పాఠశాలలో చదువులో వెనుకబడిన సీ, డీ గ్రేడ్ విద్యార్థుల కోసం ఏపీ మ్యాథ్‌మెటిక్ ఫోరం రూపొందించిన గణిత దీప్తిని పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. రాజాం పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రాజాం ఏపీఎమ్ఎఫ్ ప్రతినిధులు ఈ ప్రతులను ఆవిష్కరించి, విద్యార్థులకు అందించారు. ఏపీ మ్యాథ్‌మెటిక్ ఫోరం రాజాం ప్రాంతీయ ఉపాధ్యాయులు ఎస్.హుస్సేన్, టి.కృష్ణంరాజు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు పట్టుదల ఎంతో అవసరం

రాజాం సిటీ: అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి పట్టుదల ఎంతో అవసరమని మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక జీసీఎస్‌ఆర్ మైదానంలో ఆర్మీ ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న యువకులకు మానసిక దృఢత్వంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్స్ ఎ.శ్యామలరావు, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సంతాపం

సంతకవిటి: మండలంలోని బూరాడపేట గ్రామానికి చెందిన కాపు సామాజిక వర్గ మాజీ ప్రధాన కార్యదర్శి, పాలిటెక్నికల్ కళాశాల రిటైర్డ్ పీడీ సిరిపురపు కన్నంనాయుడు(74) మంగళవారం అనారోగ్యంతో మరణించడంతో శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యన్నారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ సిరిపురపు వెంకటరమణ, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు తదితరులు సంతాపం తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడీ పోటీలకు ఎంపిక

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు డి.జ్యోత్స్న, ఎస్.సుజాత,ఎస్.సునీత,ఎస్.కల్పన, జి.మేఘనలు ఈ నెల 25 నుంచి 27 వరకు కర్నూలు డి.ఎస్.ఎ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వి.వెంకటరావు తెలిపారు. రిని ఉపాధ్యాయులు అభినందించారు.

బదిలీ ఉద్యోగులకు ఘన సన్మానం

తెర్లాం: మండలంలోని విజయరాంపురం గ్రామ సచివాలయంలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉద్యోగులను బుధవారం గ్రామ సర్పంచ్ బూరి మధుసూదనరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామ పెద్దలు బదిలీపై వెళ్లిన ఉద్యోగులందరికీ జ్ఞాపికలు, శాలువాలు కప్పి సన్మానం చేశారు.

అపార్ పూర్తి చేయాలి

బాడంగి: అపార్ ప్రక్రియను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని విద్యా శాఖ కమిషనర్ విజయరామరాజు, ఎస్‌పీడీ శ్రీనివాసరావు అన్నారు. వీసీ సమావేశంలో బుధవారం ఈ మేరకు రాష్ట్రంలో విద్యాశాఖాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓలు లక్ష్మణదొర, రాజేశ్వరి హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన పేద కుటుంబానికి రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన దుమ్మెద నారాయణరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్ వీజే నాయుడు సేకరించిన నగదును మృతుని భార్య స్వాతికి అందించారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

రాజాం సిటీ: రాజాం నియోజకవర్గంలోని మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి మజ్జి కృష్ణారావు అన్నారు. బుధవారం రాజాంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు సంబంధించి మాజీ సైనికులకు వర్తించే సంక్షేమ పథకాలను వివరించారు.

ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్‌పై శిక్షణ

సంతకవిటి: మండలంలోని మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్.ఎమ్.ఎమ్.ఎస్ పరీక్షకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు విశాఖపట్నంలోని రైల్వే హైస్కూల్ ఉపాధ్యాయిని కర్రి సాయి విమల కుమారి శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం రవిశంకర్, ఉపాధ్యాయులు గడే అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

సంతకవిటి: కాచి చల్లార్చిన నీటినే తాగాలని సంతకవిటి పీహెచ్‌సీ డాక్టర్ సౌమ్య పిలుపునిచ్చారు. మండలంలోని బొద్దూరు గ్రామంలో వైద్య సిబ్బంది చేస్తున్న డయేరియా సర్వేను పరిశీలించారు.

రక్షిత నీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలి

రేగిడి : గ్రామాల్లో ప్రజలకు తాగునీటిని అందిస్తున్న రక్షిత మంచి నీటి పథకాల ట్యాంకులను సకాలంలో క్లోరినేషన్ చేయిస్తూ ఉండాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి ఎ.కళ్యాణచక్రవర్తి అధికారులకు సూచించారు. మండలంలో లచ్చారాయపురం, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, ఖండ్యాం, వన్నలి తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించారు. తాగునీటి పథకాల ట్యాంకుల్లో క్లోరినేషన్‌పై ఆరా తీసారు. అధికారులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామంలోని దేశవాలి చెరువు గట్టుపై పేకాట ఆడుతున్న ఐదుగురుని బుధవారం అరెస్టు చేశామని ఎస్‌ఐ వై.రవికిరణ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నామని పేర్కొన్నారు. ఈ దాడిలో వారి నుంచి రూ. 32,970లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.